క్లుప్తంగా

రేపటి నుంచి రెవెన్యూ గ్రామ సదస్సులు

దేవరపల్లి: మండలంలోని 18 రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 6 నుంచి 21 వరకూ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సదస్సులు జరుగుతాయని ఆమె తెలిపారు. 6న బందపురం, 7న చిన్నాయగూడెం, 9న దేవరపల్లి, 10న యాదవోలు, 1న యర్నగూడెం, 12న దుద్దుకూరు, 13న లక్ష్మీపురం, 16న పల్లంట్ల, 17న ధుమంతునిగూడెం, 18న గౌరీపట్నం, 19న కొంగూడెం, 20న త్యాజంపూడి, 21న కురుకూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. గ్రామ సచివాలయాల వద్ద సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె తెలిపారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: ఈ నెల 6 నుంచి 20వ తేదీ వరకూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎం.మెరికమ్మ తెలిపారు. ఈ సదస్సులు ఆయా పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల వద్ద నిర్వహిస్తామన్నారు. 6న దారవరం, 7న బ్రాహ్మణగూడెం, 9న ఎస్. ముప్పవరం, 10న ఊనగట్ల, 11న చిక్కాల, 12న చాగల్లు, 13న నెలటూరు, 16, 17 వతేదీల్లో మల్లవరం క్లస్టర్ పరిధిలోని పంచాయతీల్లో, 18న మార్కొండపాడులో, 19న నందింగంపాడులో, 20 న కలవలపల్లి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ వివరించారు.

నేడు వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకుల సమావేశం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు మండలంలోని యర్నగూడెంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తారు. ఈ విషయాన్ని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి తానేటి వనిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నాయకులు సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

కాకర్లను పరామర్శించిన ఎంపీపీ పోశిరాజు

తాళ్లపూడి: మండలంలోని పోచవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఆ పార్టీ మండల మాజీ కన్వీనర్ కుంటముక్కల కేశవనారాయణ, మండల నాయకులు యాళ్ల బాబురావు, వల్లభని శ్రీహరి, గన్నిన రత్నాజీ తదితరులు కాకర్ల వెంకటేశ్వరరావును పరామర్శించారు. కాకర్ల లక్ష్మి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

రాజీ పడదగిన కేసులు పరిష్కరించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి అనురాధ, ఇతర న్యాయమూర్తులు

కొవ్వూరు: ఈ నెల 14న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన అన్ని క్రిమినల్ కేసులూ పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులను జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ సూచించారు. పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులతో న్యాయమూర్తి కొవ్వూరులో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీసు స్టేషన్ల వారీగా ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? వాటిలో ఎన్ని కేసులను రాజీ చేయడానికి పోలీసులు కృషి చేయాలో ఆమె సూచించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జీబీటీఎస్ దేవి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మిలతో పాటు పోలీసు, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు పాల్గొన్నారు.

ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఏర్పాటు చేయాలి



మహిళా పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ నాయకురాలు మల్లిక

కొవ్వూరు: మహిళల పని ప్రదేశాల్లో ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఏర్పాటు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు ఈమని మల్లిక డిమాండ్ చేశారు. బుధవారం ఆమె స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మహిళా పారిశుధ్య కార్మికులను కలిసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా ఉద్యోగులు, కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. రోజురోజుకూ పెరుగుతున్న విష సంస్కృతి వలన మహిళలకు భద్రత,రక్షణ లేకుండా పోతోందన్నారు. ప్రభుత్వం అన్ని శాఖల్లోనూ ఉమెన్ పొటెక్షన్ సెల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అన్నదాత.. దుఃఖీభవ

- పెట్టుబడి సాయం ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- ఎర్ర కాలువ వరద, ఫెంగల్ తుపానుతో రైతు కుదేలు
- అప్పులతోనే రబీ సాగుకు సన్నద్ధం
- ఇప్పటికీ జమ కాని ఇన్‌పుట్ సబ్సిడీ
- నియోజకవర్గంలో 58,035 ఎకరాల్లో పంటల సాగు



నిడదవోలు మండలం డి.ముప్పవరం వద్ద రబీకి ఆకుమడి సిద్ధం చేస్తున్న రైతులు



కంసాలిపాలెంలో ఎర్ర కాలువ వరద ముంపుతో కుళ్లిపోయిన వరిపొలం (ఫైల్)

నిడదవోలు రూరల్: ఖరీఫ్ అయిపోయింది.. రబీ వచ్చింది.. కూటమి ప్రభుత్వం మాత్రం వ్యవసాయానికి పైసా విదల్చలేదు. ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకు వరాల జల్లు కురిపించారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా దాటవేస్తూ వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేసిన రైతు భరోసా పథకానికి 'అన్నదాత సుఖీభవ' అంటూ పేరు మార్చి సరిపెట్టుకుంది. ఆ తరువాత అదిగో.. ఇదిగో అంటూ పెట్టుబడి సాయం ఊసు మాత్రం ఎత్తలేదు. ఖరీఫ్‌లో తీవ్రంగా నష్టపోయిన రైతులంతా అప్పులతోనే రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కాస్త అన్నదాత దుఃఖీభవగా మారుతోంది.

పరిహారం మాటలకే పరిమితం

నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో 58,035 ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు.ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో సంభవించిన ఎర్ర కాలువ వరదలకు నిడదవోలు మండలంలోని రావిమెట్ల, కంసాలిపాలెం, సింగవరం, తాళ్లపాలెం, తాడిమళ్ల, తిమ్మరాజుపాలెం, ఉండ్రాజవరం మండలం కాల్దారి, పసలపూడి, సూర్యారావుపాలెం గ్రామాల్లోని 6,132 ఎకరాల్లో పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అంతేగాకుండా గోదావరి వరదలతో పెరవలి మండలం ముక్కామల, కాకరపర్రు, ఉసులుమర్రు, తీపర్రు, ఖండవల్లి గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అధికారుల బృందం నష్టపోయిన పంటలను పరిశీలించారు. వెంటనే పంట నష్టపరిహారం అందిస్తామని రైతులకు గొప్పగా హామీలిచ్చారు.అయితే నేటికీ రైతుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ కాలేదు. నీట మునిగిన పొలాల్లో మళ్లీ నాట్లు వేసి సాగు చేయగా ఫెంగల్ తుపాను ప్రభావంతో రైతులు మళ్లీ నష్టపోయారు.



ఫెంగల్ తుపాను వేళ సమిశ్రగూడెంలో ధాన్యం తడవకుండా కప్పిన బరకాలు

నియోజకవర్గంలో ప్రస్తుత పంటల సాగు వివరాలు

మండలం	ఎకరాలు
నిడదవోలు	22,470
పెరవలి	16,765
ఉండ్రాజవరం	18,800

సుఖీభవ కోసం ఎదురు చూపులు

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నిడదవోలు నియోజకవర్గంలోని 21,334 మంది అర్హులైన రైతులకు పెట్టుబడి సాయం అందాల్సి ఉంది. ఒక్కో రైతుకు రూ.6 వేల చొప్పున కేంద్రం నుంచి పీఎం కిసాన్ నిధి నుంచి జమవుతుంది. ఈ ఏడాదికి సంబంధించి జూన్ 18న, అక్టోబర్ 5న రెండు విడతలుగా రూ.2 వేల చొప్పున కేంద్రం రైతుల బ్యాంకు ఖాతాల్లో పీఎం కిసాన్ సాయాన్ని జమ చేసింది. తాము అధికారంలోకి వస్తే ఏటా అన్నదాత సుఖీభవం పథకంలో భాగంగా రూ.20 వేల చొప్పున ఇస్తామని కూటమి పార్టీలు ప్రకటించాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందించాల్సిన సాయం ఇప్పటి వరకూ రైతుల ఖాతాలకు చేరలేదు. రూ.20 వేలు ఎప్పుడిస్తారు..? ఎన్ని విడతలుగా అందిస్తారు? పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా ఇస్తారా? రూ.6 వేలు పోను మిగతా రూ.14 వేలు అందిస్తారా? అనేది కూడా స్పష్టం చేయకుండా అన్నదాతలను మోసగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రబీ సీజన్‌లోనైనా సాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ సాయం అందలేదు



రైతు సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ.20 వేలు సాయం చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. సార్వా సాగు పూర్తి చేసి మళ్లీ దాళ్వాకు సిద్ధమవుతున్నాం. నేటికీ ప్రభుత్వ సాయం అందలేదు. గత ప్రభుత్వంలో ఏటా రైతు భరోసా ద్వారా ప్రతి రైతు ఖాతాకు డబ్బులు జమచేసేవారు. ఎర్ర కాలువ వరదతో నష్టపోయిన రైతులకు ఇప్పటికీ బ్యాంకు ఖాతాల్లో పరిహారం వేయలేదు. రైతులను కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం సాయం చేయాలి.

– పులుమంతుల రామారావు, రైతు, పందలపర్రు

నాడు రైతులకు అండగా జగన్

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని సీజన్‌కు ముందే అందించేవారు. కరోనా లాంటి సంక్షోభంలో కూడా ఏటా క్రమం తప్పకుండా జూన్‌లో రూ.7,500, అక్టోబర్‌లో రూ.4 వేలు, జనవరిలో రూ.2 వేలు రైతుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ అయ్యేది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కౌలురైతులతో పాటు దేవదాయ, ఆటవీ, వక్ఫ్ తదితర ప్రభుత్వ భూములు సాగుచేస్తున్న కౌలుదారులకు అప్పటి ప్రభుత్వం ఏటా రూ.13,500 చొప్పున అందజేసింది. నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాలకు చెందిన 21,334 మంది రైతులకు రూ.115.20 కోట్లు రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించారు.

గోదావరిలో వ్యక్తి మృతదేహం లభ్యం



యలమాటి శ్రీనివాసరావు మృతదేహం

కొవ్వూరు: దేవరపల్లి మండలం సంగాయగూడేనికి చెందిని యలమాటి శ్రీనివాసరావు మృతదేహం బుధవారం పట్టణంలోని ఎరినమ్మ గోదావరి ఇసుక ర్యాంపులో లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసరావు సోమవారం తన ఇంటి నుంచి కారులో బయటకు వచ్చారు. మంగళవారం రాత్రి ఏడు గంటలకు ఆయన తన కారును స్థానిక గోష్పాద క్షేత్రంలో విడిచిపెట్టి గోదావరి నదిలోకి దిగి గల్లంతయ్యారు. మరో పక్క శ్రీనివాసరావు ఆచూకీ కోసం ఆయన కుటుంబ సభ్యులు వెతుకులాట ప్రారంభించారు. కారును మంగళవారం రాత్రి గోష్పాద క్షేత్రంలో గుర్తించారు. సెల్‌ఫోన్, పర్సు కారులో ఉంచి గోదావరి నదిలోకి దిగిన శ్రీనివాసరావు తిరిగి రాలేదని స్థానికుల ద్వారా కుటుంబ సభ్యులు తెలుసుకున్నారు. నదిలో మునిగి గల్లంతై ఉండవచ్చని భావించి నది వెంబడి గాలించారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు మృతదేహం ఎరినమ్మ ఇసుక ర్యాంపు ఒడ్డునే బుధవారం లభ్యమైంది. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మంగళవారం రాత్రి మృతుడి భార్య పద్మకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎంవీ సత్యనారాయణ శ్రీనివాసరావు అదృశ్యంపై కేసు నమోదు చేశారు. మృతదేహం లభ్యం కావడంతో అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

గుర్తింపు కార్డు ఉంటేనే పోలింగ్ కేంద్రంలోకి అనుమతి

- కలెక్టరు ప్రశాంతి ఆదేశం
- నల్లజర్ల, కొవ్వూరుల్లో టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల పరిశీలన



నల్లజర్లలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నల్లజర్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను బుధవారం కలెక్టరు ప్రశాంతి పరిశీలించారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తున్నారు. సజావుగా పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు, ఎన్నికల సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ ఏజెంట్లకు జారీ చేసిన గుర్తింపు కార్డు పరిశీలించి తగిన సిటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్లు పోలింగ్ బూత్‌లోకి వెళ్ళడానికి, బయటకు రావడానికి విడివిడిగా మార్గాలు ఉండాలన్నారు. ఈ పోలింగ్ కేంద్రం పరిధిలో 127 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 79 మంది,మహిళలు 48 మంది ఉన్నట్టు డిప్యూటీ తహసీల్దార్ శాంతిప్రియ కలెక్టరుకు వివరించారు.

కొవ్వూరులో..

కొవ్వూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు. గురువారం ఉదయం ఎనిమిది గంటలకు ఎన్నిక ప్రక్రియ ప్రారంభం అవుతుందని, సాయంత్రం నాలుగు గంటలకు వరకూ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు హక్కువినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. ఓటర్ల జాబితాను అనుసరించి ఓటర్లను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలని ఆదేశించారు. పోలింగ్ ఏజెంట్లకు జారీ చేసిన గుర్తింపు కార్డులను కలెక్టర్ పరిశీలించారు. కొవ్వూరు పోలింగ్ కేంద్రంలో 231 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్, ఎంపీడీవో కె.సుశీల,ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం రోశయ్య



రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో వెలగా శ్రీరామమూర్తి, ఆర్యవైశ్య సంఘ సభ్యులు

గోపాలపురం: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య తెలుగు రాష్ట్రాల ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి అన్నారు. రోశయ్య వర్ధంతిని బుధవారం గోపాలపురం ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో ఆర్యవైశ్య సంఘం మండలశాఖ అధ్యక్షుడు సుతాపల్లి శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొల్లూరి సత్యనారాయణ, మద్దు జగన్‌మోహన్‌రావు, గుబ్బా శ్రీను, లక్ష్మణరావు, మద్దు కాశీ, చిత్తపూడి సుబ్బారావు మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి పాలకావడి సేవ

- షష్టి మహోత్సవాలు ప్రారంభం
- 6న స్వామి వారి కల్యాణం



దేవరపల్లిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు



దేవరపల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పాల కావడి సేవలో భక్తులు

దేవరపల్లి: స్థానిక వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 8 వరకూ ఈ ఉత్సవాలు జరుగుతాయి. బుధవారం ఉదయం స్వామివారి పాలకావడి సేవకు భక్తులు శ్రీకారం చుట్టారు. 108 మంది భక్తులు పాల కావడిలను భుజాలపై పెట్టుకుని తొలుత స్థానిక వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం వారు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ గ్రామంలోని పలు ఆలయాలను సందర్శించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పాలాభిషేకం నిర్వహించారు. ఆలయం కమిటీ సభ్యులు భక్తులకు కావడిలను అందజేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి భక్తులు పాలకావడి సేవలో పాల్గొన్నారు. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు.

మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

కొవ్వూరు: పట్టణ శివారు దొండగుంట–2 ఇసుక ర్యాంపు వద్ద డిస్ట్రిక్ట్ లెవెల్ సాండ్ కమిటీ అనుమతి మేరకు నడుపుతున్న ర్యాంపులో పొక్లెయిన్‌తో అక్రమంగా మట్టిని తవ్వేస్తున్నారని ది విజ్జేశ్వరం బోట్స్‌మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి ఎం.రామశేఖర్‌రెడ్డి ఇరిగేషన్ ఈఈకు ఫిర్యాదు చేశారు. తమ సొసైటీ స్థలం మార్జిన్‌లోనే 11.400 నుంచి 11.800 వరకూ అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు సాగించినట్టు ఆ ఫిర్యాదులు పేర్కొన్నారు. తవ్వకం పనులను ఆపమని తమ సొసైటీ సభ్యులు అడిగితే తమకు ఇరిగేషన్ ఈఈ, ఏఈల అనుమతులు ఉన్నట్టు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ అక్రమ తవ్వకాన్ని నిలుపుదల చేయించి, పొక్లెయిన్‌ను సీజ్ చేయాలని ధవళేశ్వరం ఈఈకు ఫిర్యాదు చేసినట్టు రామశేఖర్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠ రాజును 'సాక్షి' వివరణ కోరింది. పనులను నిలుపుదల చేయించామని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశామని బదులిచ్చారు.

11న రైల్వేగేటు మూసివేత

నిడదవోలు : పట్టణంలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ఉన్న నిడదవోలు–తాడేపల్లిగూడెం రైల్వే గేట్‌ను ఈ నెల 11వ తేదీ రాత్రి 10 గంటల నుంచి 12వ తేదీ రాత్రి 10 గంటల వరకు రైల్వే శాఖాధికారులు మూసివేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి తెలిపారు. రైల్వే గేటు వద్ద ఉన్న రైల్వేట్రాక్ మరమ్మతుల కోసం గేటు మూసివేస్తారన్నారు. ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని ఆమె కోరారు.

నేటి ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



పెరవలి పోలింగ్ బూత్‌కు సామగ్రితో వస్తున్న పోలింగ్ సిబ్బంది

నిడదవోలు/దేవరపల్లి/పెరవలి/తాళ్లపూడి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరుగుతుంది. ఇందుకోసం నిడదవోలు బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 204 మంది టీచర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఎన్నికల ఏర్పాట్లను తహసీల్దార్ ఎం.నాగరాజు నాయక్ బుధవారం పరిశీలించారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 342 మంది టీచర్స్ ఓటర్లు ఉన్నారు. మండలాలవారీగా దేవరపల్లిలో 90 మంది, గోపాలపురంలో 56 మంది, నల్లజర్లలో 127 మంది, ద్వారకాతిరుమలలో 69 మంది ఓటర్లు ఉన్నారు. దేవరపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి బుధవారం పరిశీలించారు. ఇక పెరవలి మండలంలో 66 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. వారంతా పెరవలిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఇప్పటికే పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. తాళ్లపూడి మండలానికి తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద 73వ నంబర్ పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. బుధవారం మధ్యాహ్నం పోలింగ్ సిబ్బంది ఈ కేంద్రానికి పోలింగ్ సామగ్రితో సహా చేరుకున్నారు. మండలంలోని 61 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ తహసీల్దార్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలంటూ ధర్నా



డీటీకి వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు

ఉండ్రాజవరం: ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ చంగయ్యపై దాడి చేసిన భజరంగ్ దళ్, వీహెచ్‌పీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మత ఘర్షణలు సృష్టిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్‌కు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మర్రి మహాలక్ష్ముడు, బత్తిన ఆశీర్వాదం, చల్లాబత్తుల సత్యనారాయణ, పాస్టర్లు షారోన్‌రాజు, జె.దానియల్, సుధాకర్, దుర్గారావు, గుమ్మాపు శ్రీను, బద్దా జాన్ పాల్గొన్నారు.

పరమ చెత్తగా పంగిడి రోడ్డు

- ఇటీవలి వర్షాలకు మరింత అధ్వానం
- పలువురికి ప్రమాదాలు
- గుంతలు కూడా పూడ్చని ప్రభుత్వం



బ్రాహ్మణగూడెం వద్ద నిడదవోలు- పంగిడి రహదారి దుస్థితి



ఎస్. ముప్పవరం గ్రామంలో గుంతలు

చాగల్లు: నిడదవోలు– పంగిడి ప్రధాన రహదారి అడుగుకో గొయ్యి చొప్పున అధ్వానంగా మారింది. ఈ ఏడాది కురిసిన వర్షాలకు సుమారు 12 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారి పూర్తిగా దెబ్బతింది. దాంతో వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై అడగడుగునా గోతులే దర్శనం ఇస్తున్నాయి. వాటిని గుర్తించక లేక, తప్పించుకుని వెళ్లే క్రమంలో ఎంతోమంది వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. అయినప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ రహదారిపై నేటికీ కనీసం గుంతలు పూడ్చే పనులు కూడా ఇంతవరకూ చేపట్టలేదు. ఈ రోడ్డులోని ఎస్.ముప్పవరం వద్ద రోడ్డు పరిస్థితి మరీ ప్రమాదకరంగా ఉంది. ఊనగట్ల వద్దా అదే పరిస్థితి. అలాగే బ్రాహ్మణగూడెంలో మలుపు వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మీనానగరం వద్ద పరిస్థితి మరో ఘోరంగా ఉంది. సుమారు మూడు నెలల క్రితం ఈ రహదారికి మరమ్మతులు చేపట్టారు. అయితే పనుల్లో నాణ్యత లోపించడం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు గోతులను క్వారీ డస్ట్‌తో తాత్కాలికంగా పూడుస్తున్నారని, కొద్దిరోజులకే గుంతలు మళ్లీ బయట పడుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. పలు గ్రామాల్లో స్థానికులే పాత భవనాల వేస్ట్ మెటీరియల్‌తో గుంతలను తాత్కాలికంగా పూడ్చినప్పటికీ వర్షాలకు మళ్లీ రోడ్డు యథా పరిస్థితికి వచ్చింది. ఈ మార్గంలో క్వారీ లారీలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. దానికి తోడు అడుగడుగునా.. గోతులు. దాంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రోడ్డుపైకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ప్రధానంగా ఈ రహదారిపై సిమెంట్ రోడ్డు, బీటీ రోడ్డు కలయిక ప్రాంతాల వద్ద గోతులు ఎక్కువగా పడ్డాయి. ఈ రోడ్డుపై చాగల్లు శివారు జూనియర్ కళాశాల వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బ్రాహ్మణగూడెం వద్ద జరిగిన మరో ప్రమాదంలో ఒక మహిళతో పాటు చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. అధికారులు చర్యలు తీసుకుని పూర్తిస్థాయిలో ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.